మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

34 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను నిలువునా ముంచిన చంద్రబాబు!

- సుప్రీంకోర్టు తీర్పుతో కూటమి ప్రభుత్వ నయవంచన బట్టబయలు
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజం

శ్రీకాకుళం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, ఆ హామీ అమలులో విఫలమైందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు తలెత్తాయని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన అంశాలు తెలిసి కూడా హామీ ఇచ్చి, కోర్టుల్లో నిలవని జీవోలు తీసుకొచ్చి బీసీలను మభ్యపెట్టారని ఆరోపించారు. శ్రీకాకుళంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ధర్మాన, బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు ఓటర్ల జాబితాల తయారీలోనూ పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. ప్రెస్‌మీట్‌లో ధర్మాన ప్రసాదరావు ఏమన్నారంటే..

బీసీ రిజర్వేషన్లపై కాలయాపన ఎందుకు?

రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న న్యాయపరమైన పరిమితి తెలిసి కూడా చంద్రబాబు 34 శాతం రిజర్వేషన్ల హామీని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టబద్ధమైన ప్రక్రియను ముందుగానే పూర్తి చేయాలి. ఒకసారి ఏకసభ్య కమిషన్ అంటారు.. మరోసారి కుటుంబ వివరాల లెక్కలంటూ కొత్త పద్ధతులు



తీసుకొస్తారు. ఇవన్నీ న్యాయస్థానాల్లో నిలుస్తాయా లేదా అన్నది ముందే ఆలోచించాల్సింది. చట్టం నిర్దేశించిన ప్రకారం కమిషన్ ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా జీవోలు జారీ చేసి, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లి ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎందుకు? బీసీలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించకుండా, వారికి న్యాయం చేయాలి. చేసిన తప్పులకు చంద్రబాబు రాష్ట్రంలోని బీసీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి."

పారదర్శక ఓటర్ల జాబితాలు అవసరం

కుటుంబ వివరాలు సేకరించి లెక్కలు చూపించడం మాత్రమే బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించడానికి సరిపోదు. చట్టం నిర్దేశించిన నిబంధనల ప్రకారం కమిషన్ ఏర్పాటు చేసి, పారదర్శకమైన సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆ నివేదిక ఆధారంగా అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే హామీని అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఓటర్ల జాబితాల తయారీలోనూ నిర్లక్ష్యం ఉండకూడదు. బీసీలకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. స్థానిక సంస్థల ఎన్నికలను సక్రమంగా నిర్వహించి, బీసీలకు న్యాయం చేయాలి.

బీసీలకు రిజర్వేషన్లపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?

అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల గురించి ప్రచారం చేసుకున్న చంద్రబాబు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయంలో ఎందుకు అదే చొరవ చూపలేదు? కేంద్రంలో ఎన్డీయే భాగస్వామిగా ఉండి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు? బీసీలకు న్యాయం చేస్తామని చెప్పి, ఎన్నికల తర్వాత న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే జీవోలు తీసుకురావడం ఏ విధమైన చిత్తశుద్ధి? వైయస్ జగన్ హయాంలో బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాం. కేబినెట్, రాజ్యసభ, కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్లు, జడ్పీ చైర్మన్లు, స్థానిక సంస్థల్లో వారికి అవకాశాలు కల్పించాం. పార్టీ పరంగా సీట్లు ఇవ్వడం వేరు.. చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించడం వేరు. బీసీలకు జరిగిన అన్యాయానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

Main Edition
09 Oct 2026 Page No. 3